జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 1 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 5



## భూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి

- విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 30,(ప్రజా జ్యోతి)** చుంచుపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృతంగా పర్యటించి భూ రీ సర్వే ప్రక్రియను పరిశీలించడంతో పాటు చుంచుపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా చుంచుపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు ,చుంచుపల్లి గ్రామ పరిధిలో మొత్తం 2 వేల 27 ఎకరాల 30 గుంటల భూమి ఉన్ననేపథ్యంలో ప్రభుత్వ భూములతో పాటు

మిగతా 2 లో...




# దుగినేపల్లి పంచాయతీలో నిధుల దుమారం!

- రూ.7.76 లక్షల ఖర్చుపై గ్రామస్తుల తీవ్ర అనుమానాలు
- పనులు ఎక్కడ..? బిల్లులు ఎలా వచ్చాయి..?
- సర్పంచ్, ఉపసర్పంచ్‌ల సంతకాలతో బిల్లులంటూ ఆరోపణలు
- ఒక్కరి పేరుతో రూ.3 లక్షల వరకు ఎంబీలు.. రూ.1.50 లక్షల ఎలక్ట్రికల్ బిల్లుపై ప్రశ్నలు
- బిల్లులకు ఆమోదం ఇచ్చిన అధికారులపై కూడా సందేహాలు
- జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణకు గ్రామస్తుల డిమాండ్

**పినపాక, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** పినపాక మండలంలోని దుగినేపల్లి గ్రామపంచాయతీలో గత ఐదు నెలల్లో సుమారు రూ.7.76 లక్షల నిధులు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో నమోదై ఉండటంపై గ్రామంలో తీవ్ర చర్చ జరుగుతోంది. గ్రామ అభివృద్ధి కోసం వినియోగించాల్సిన నిధులకు సంబంధించి రికార్డుల్లో నమోదైన ఖర్చుకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పనులకు పొంతన ఉందా? అనే అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు కోరుతున్నారు.

**›› పనులు ఎక్కడ..? బిల్లులు ఎలా వచ్చాయి..?**

పంచాయతీ నిధులతో వివిధ పనులు చేపట్టినట్లు రికార్డుల్లో చూపుతున్నప్పటికీ, ఆయా పనులు వాస్తవంగా ఎంత మేర జరిగాయనే దానిపై గ్రామస్తులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. పనుల కొలతలు, ఎంబీలు, బిల్లులు, వౌచర్లు, చెల్లింపులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుందని అంటున్నారు.

**›› రూ.3 లక్షల ఎంబీ.. సంబంధం లేదంటున్నారా?**

కొమరం సుధాకర్ పేరుతో గత ఐదు నెలల్లో సుమారు రూ.3 లక్షల వరకు ఎంబీలు, బిల్లులు నమోదైనట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే తనకు పంచాయతీ పనులతో ఎలాంటి సంబంధం లేదని, తాను ఆన్‌లైన్ సెంటర్ నిర్వహిస్తున్నందున తన

మిగతా 2 లో...

## భద్రాచలంలో భారీగా పట్టుబడ్డ గంజాయి

- సుమారు 30 లక్షల విలువగల 109 కిలోల గంజాయి స్వాధీనం



**భద్రాచలం, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):** భద్రాచలం ఎక్సైజ్ అధికారులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 109 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.మొదట హీరో బైక్ (ఓడి-30 హెచ్-1783)ను తనిఖీ చేయగా 9 కిలోల గంజాయి లభించింది. బైక్ పై ఉన్న ఒడిశా రాష్ట్రం మల్కానగిరి జిల్లా కలిమెలకు చెందిన దివాకర్ మండల్ ను అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం వెనుక వచ్చిన హ్యుందాయ్ వెర్నా కారు (ఏపీ-10-ఏపీ-8269)ను తనిఖీ చేయగా మరో 100 కిలోల గంజాయి పట్టుబడింది. కారులో ఉన్న సుమన్ పాల్ ను కూడా అరెస్టు చేశారు.గంజాయిని మల్కానగిరి జిల్లా కలిమెల నుంచి మహారాష్ట్రలోని ముంబయికి తరలిస్తున్నట్లు నిందితులు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి, బైక్, కారుతో పాటు మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.ఈ దాడిలో కొత్తగూడెం ఏఈఎస్ ఎన్. శ్రీనివాసరావు, డీటీఎఫ్ రమాదేవి, ఎక్సైజ్ కిష్టయ్య, డీటీఎఫ్ సలీముల్లాఖాన్, అల్లూరి సీతారామరాజు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అనవసర విషయాల్లో తలదూర్చొద్దు

- బాధ్యతతో విధులు నిర్వహించాలని హితవు
- సిక్స్ బెటాలియన్ వసతులపై ఆరా..!
- సిబ్బంది యోగక్షేమాలు తెలుసుకున్న డీఐజీ
- మణుగూరు పోలీస్ స్టేషన్ లో డీఐజీ ఆకస్మిక తనిఖీ
- డీఐజీకి స్వాగతం పలికిన డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ నాగబాబు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి , మణుగూరు. సెప్టెంబర్ 30, ప్రజాజ్యోతి** బెటాలియన్ పోలీస్ సిబ్బంది అనవసర విషయాల్లో తలదూర్చొద్దని, ముఖ్యంగా పంచాయతీలలో అడుగుపేట్టొద్దని సిక్స్ బెటాలియన్ డీఐజీ మురళీకృష్ణ అన్నారు. బుధవారం మణుగూరు సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ న్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మణుగూరుకు చేరుకున్న ఆయనకు

మిగతా 2 లో...

# దుగినేపల్లి పంచాయతీలో నిధుల దుమారం!




(మొదటి పేజీ తరువాయి...)
ఖాతాలోకి డబ్బులు వస్తే సంబంధిత వ్యక్తులకు నగదు రూపంలో తిరిగి ఇస్తున్నానని సుధాకర్ చెబుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో పంచాయతీ పనులకు సంబంధించిన చెల్లింపులు ఆయన ఖాతాలోకి ఎందుకు వెళ్లాయి? ఆయన పేరుతో నమోదైన పనులు వాస్తవంగా ఎవరు చేశారు? సంబంధిత పనులకు సంబంధించిన ఆధారాలు ఏమిటి? అనే ప్రశ్నలు గ్రామస్తుల్లో తలెత్తుతున్నాయి. ఈ అంశాలను అధికారులు బ్యాంకు లావాదేవీలు, ఎంబీలు, బిల్లులు పరిశీలించి స్పష్టం చేయాలని కోరుతున్నారు.

### ›› రూ.1.50 లక్షల ఎలక్ట్రికల్ బిల్లు.. లెక్క తేల్చాలంటున్న ప్రజలు

'వైరింగ్ అండ్ లైట్స్' పేరుతో సుమారు రూ.1.50 లక్షల మేర ఎంబీలు చేసి, కిరణ్ ఎలక్ట్రికల్స్ పేరుతో చెల్లింపులు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. దుగినేపల్లి గ్రామంలో సుమారు 60–70 విద్యుత్ స్తంభాలు ఉన్న నేపథ్యంలో బల్బులు, వైరింగ్, కూలీల ఖర్చుతో కలిపి రూ.1.50 లక్షల వ్యయం ఎలా వచ్చిందో అధికారులు పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. బిల్లుల్లో చూపిన సామగ్రి వాస్తవంగా కొనుగోలు చేశారా? ఎంత సామగ్రి వినియోగించారు? పనులు ఎక్కడ జరిగాయి? బిల్లుల్లో పేర్కొన్న మొత్తానికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయా? అనే అంశాలపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### ›› సంతకాలు సర్పంచ్, ఉపసర్పంచ్‌లవేనా..?

ఎంబీలు, బిల్లుల ప్రక్రియలో సర్పంచ్, ఉపసర్పంచ్‌ల సంతకాలు ఉన్నాయంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పనులు పూర్తయ్యాయా? బిల్లుల్లో చూపిన సామగ్రి వాస్తవంగా వినియోగించారా? అనే అంశాలను పరిశీలించిన తర్వాతే సంతకాలు చేశారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.పంచాయతీ నిధుల వ్యవహారంలో సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ఏమైనా ఆర్థిక ప్రయోజనం కలిగిందా? అనే అనుమానాలను కొందరు గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత ప్రజాప్రతినిధుల అధికారిక వివరణ రావాల్సి ఉంది. విచారణ అనంతరం మాత్రమే వాస్తవాలు నిర్ధారణ కావాల్సి ఉంది.

### ›› అధికారుల మౌనం ఎందుకు..?

పంచాయతీ నిధుల చెల్లింపులకు సంబంధించి మండల స్థాయి అధికారుల పరిశీలన, ఆమోద ప్రక్రియ ఉన్న నేపథ్యంలో ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు గ్రామంలో వినిపిస్తున్నాయి.పనులు వాస్తవంగా జరిగాయా? ఎంబీలు ఎవరు తయారు చేశారు? బిల్లులను ఎవరు పరిశీలించారు? క్షేత్రస్థాయి తనిఖీలు జరిగాయా? చెల్లింపులకు ఎవరు ఆమోదం ఇచ్చారు? అనే వివరాలను అధికారులు వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ›› జిల్లా అధికారుల విచారణకు డిమాండ్

దుగినేపల్లి పంచాయతీలో గత ఐదు నెలల్లో జరిగిన సుమారు రూ.7.76 లక్షల ఖర్చుపై జిల్లా స్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.
ఎంబీలు, బిల్లులు, వౌచర్లు, బ్యాంకు లావాదేవీలు, సరఫరా బిల్లులు, పంచాయతీ తీర్మానాలతో పాటు క్షేత్రస్థాయిలో జరిగిన పనులను కూడా పరిశీలించాలని కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమని తేలితే పూర్తి లెక్కలను ప్రజల ముందు ఉంచి అనుమానాలను నివృత్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ›› ఎంపీఓ వెంకటేశ్వరరావు వివరణ

దుగినేపల్లి గ్రామపంచాయతీలో నిధుల వినియోగంపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపడతామని పినపాక మండల ఎంపీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. పంచాయతీలో గత ఐదు నెలల్లో జరిగిన పనులు, నిధుల



ఖర్చుకు సంబంధించిన రికార్డులను పూర్తిగా పరిశీలిస్తామని పేర్కొన్నారు.ఎంబీలు, బిల్లులు, వౌచర్లు, చెల్లింపులు, ఇతర సంబంధిత వివరాలను పరిశీలించిన అనంతరం వాస్తవ పరిస్థితులపై ఒక నిర్ణయానికి వస్తామని తెలిపారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పనులను కూడా పరిశీలిస్తామని పేర్కొన్నారు.పంచాయతీ నిధులకు సంబంధించి ఏవైనా అవకతవకలు జరిగినట్లు రికార్డుల పరిశీలన, విచారణలో తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తామని ఎంపీఓ వెంకటేశ్వరరావు వెల్లడించారు.

### ›› విచారణపైనే అందరి దృష్టి

దుగినేపల్లి పంచాయతీలో రూ.7.76 లక్షల నిధుల ఖర్చుపై గ్రామస్తులు వ్యక్తం చేస్తున్న అనుమానాలు, ఆరోపణల నేపథ్యంలో ఎంపీఓ ప్రకటించిన విచారణకు ప్రాధాన్యం ఏర్పడింది. రికార్డులు, బ్యాంకు లావాదేవీలు, ఎంబీలు, బిల్లులతో పాటు క్షేత్రస్థాయి పనులను పరిశీలించిన తర్వాతే ఆరోపణల్లో వాస్తవమెంత? అనేది తేలనుంది. జిల్లా యంత్రాంగం ఈ వ్యవహారంపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

## దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఎన్నిక



**గుండాల సెప్టెంబర్ 30. ప్రజా జ్యోతి** శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా దుర్గాదేవి ఉత్సవాలను గత ఎనిమిదేళ్లుగా ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈసారి జరిగే ఉత్సవాలను మరింత ఉత్సాహంగా ఘనంగా నిర్వహించుకునేందుకు యువకులు కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా భక్తిని రమేష్, కార్యదర్శిగా జవాజి పవన్ కుమార్ పండును ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఉపాధ్యక్షులుగా గుండెబోయిన లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శిగా బొబ్బిలి శ్రావణ్, కోశాధికారిగా మాచర్ల రంజిత్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ఉత్సవాలను కులమతాలకు అర్చకంగా, ఐక్యమతంతో నిర్వహించుకునేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు ఎప్పుడు సహకరించినట్టుగానే ఈసారి ఈ ఉత్సవాలకు సహకరించి మాకు తోడ్పాటుగా ఉండాలని కోరారు. పత్తి ఐక్యమతానికి కత్తికగా గుండాల దుర్గాదేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో యాసారపు సురేష్, మాచర్ల వంశీ, పిల్లి కృష్ణ, యాసారపు యాకయ్య గడ్డం సాయి, పర్లేర్ల రవి వర్మ, గడ్డం శ్రీకాంత్, వల్లోజి విద్యాసాగర్, వాసం శివ, తవుడోజు సురేష్, మాచర్ల రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## సీఐ నాగరాజుని సన్మానించిన ఐజేయు భద్రాచలం పట్టణ కమిటీ



**భద్రాచలం, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి)** భద్రాచలం టౌన్ సిఐ గా బాధ్యతలు నిర్వహించి ఖమ్మం హవేలీ ఖానాపురం పోలీస్ స్టేషన్ కి బదిలీ అయిన సీఐ నాగరాజుని బుధవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) భద్రాచలం పట్టణ కమిటీ అధ్యక్షులు విజ్జిగిరి రాజా కిరణ్, ఉపాధ్యక్షులు ఆశి అన్వేష్ రెడ్డి, కోశాధికారి బోనాల లక్ష్మీ నరసింహారావు (నాయుడు) పుష్ప గుచ్చం అందజేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారాముల ఆశీస్సులు విధి నిర్వహణలో ఎల్లవేళలా సిఐ నాగరాజు మీద ఉండాలని వారు ఆకాంక్షించారు.

## బాహ్య మూల్యాంకన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

- **టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగరాంబాబు**



**ఆళ్ళపల్లి. సెప్టెంబర్ 30(ప్రజాజ్యోతి)** రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల జారీ చేసిన బాహ్య మూల్యాంకన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగరాంబాబు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉపాధ్యాయులు అనేక బాధ్యతలు నిర్వహిస్తున్నారని, బాహ్య మూల్యాంకనంతో అదనపు పని భారం పెరిగి ప్రత్యక్ష బోధనకు ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల మూల్యాంకనాన్ని పాఠశాల స్థాయిలోనే నిర్వహించాలని, అనవసరమైన యాప్‌లు, నివేదికల భారం తగ్గించాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన అనంతరం విద్యాశాఖ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు బానోతు బోజ్య, జి.కుమార్ రాజా, కొమరం లాలయ్య, వసంత, ఈశ్వరి, కొమరం వసంతరావు, రామకృష్ణ, వీరన్న, బద్రు, రవి, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, సంపత్, శ్రీను, చిన్న, రమేష్, కోటేశ్వరీ, స్వరూప, నీలావతి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి



(మొదటి పేజీ తరువాయి...)
వ్యవసాయ భూముల భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.అనంతరం చుంచుపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, విద్యాబోధన, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా ప్రగతిని, పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి సారించి, పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.మేధో వైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తించి, వారి విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యకు దూరం కాకుండా, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, తాగునీరు, పారిశుధ్యం తదితర సదుపాయాలను వివరాలను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు, భూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ నాగరాజు, సర్వే అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనవసర విషయాల్లో తలదూర్చొద్దు



(మొదటి పేజీ తరువాయి...)
సబ్ డివిజన్ డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ పాటి నాగబాబు డీఐజీకి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలోని సిక్స్త్ బెటాలియన్ సిబ్బంది వసతి సౌకర్యాలను డీఐజీ క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బందిని పేరు పేరునా పలకరించి వారి యోగక్షేమాలు, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాలు, భోజన సదుపాయాలు, ఇతర మౌలిక వసతులపై సిబ్బందితో నేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి డీఐజీ మురళీకృష్ణ కీలక సూచనలు చేశారు. పోలీసు విధుల్లో అనవసర విషయాల్లో, ఇబ్బందులు తెచ్చిపెట్టే అంశాల్లో తలదూర్చకుండా నిబంధనల ప్రకారం బాధ్యతతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. క్రమశిక్షణతో పనిచేస్తూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని హితవు పలికారు.సివిల్, మరికొన్ని పంచాయతీలలో అడుగుపేట్టొద్దని నొక్కి చెప్పారు. తలదుర్చిన సిబ్బందికి తగు చర్యలు తప్పని డీఐజీ హెచ్చరించారు.

# మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించండి





**ఇల్లందు, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి )** ఇల్లందు మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య కోరారు. బుధవారం జరిగిన మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దండుసారయ్య మాట్లాడుతూ ఇల్లందు పట్టణంలో మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, కోతులు, వీధి కుక్కలు, సెంట్రల్ లైటింగ్, వీధిలైట్ల సమస్యల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, సంబంధిత సిబ్బందితో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయించి పైప్ లైన్ల లీకేజీలు, మోటర్లు, సరఫర వ్యవస్థలో ఉన్న సాంకేతిక సమస్యలను గుర్తించి మరమత్తులు చేపట్టాలని కోరారు. ప్రజలకు అందించే నీటి సరఫరా సమయాలను కూడా క్రమబద్ధీకరించాలన్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడం, మురుగు కాలువలను సక్రమంగా శుభ్రం చేయకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని, పారిశుద్ధ్య సిబ్బంది పనితీరు నిరంతరం పర్యవేక్షించి చెత్తను సకాలంలో తొలగించి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా మురికి కాలువలను శుభ్రం చేయకపోవడం వలన దోమల సంచారం పెరిగిపోతుందని, దానివల్ల ప్రజలకు అనారోగ సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదని తెలిపారు. మరీ ముఖ్యంగా పట్టణంలో కోతులు ఇళ్లల్లోకి ప్రవేశించి ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, వీధి కుక్కల బెడద కూడా పెరుగుతుందని, చిన్నారులు, మహిళలు, వృద్ధులపై ఏదో ఒక చోట దాడి చేయడం జరుగుతుందని వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇల్లందు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ లో కొన్నిలైట్లు వెలుగుకపోవడం వల్ల రాత్రి వేళల్లో రహదారి చీకటిగా మారుతుందని, పలు వార్డులలో వీధిలైట్లు సక్రమంగా పని చేయకపోవడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే సమస్యను త్రికదిన పరిష్కరించాలని సూచించారు.

## బాలింతలు, గర్భిణీలు జాగ్రత్తలు వహించాలి





**ఇల్లందు, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి )** బాలింతలు, గర్భిణీలు జాగ్రత్త వహించాలని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య సూచించారు. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐసీడిఎస్ పరిధిలోని ఇల్లందు మున్సిపాలిటీ 13వ వార్డు అంగన్వాడి సెంటర్ లో బుధవారం సీడిపిఓ అరుణ కుమారి ఆధ్వర్యంలో పోషక మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దండు సారయ్య మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పోషకాహారం ఎంతో కీలకమన్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. పోషకాహారంపై ప్రతి కుటుంబంలో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ముందుగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు తీసుకోవాల్సిన పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరించడంతో పాటు, స్థానికంగా లభించే ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను నిత్య ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా బాలింతలకు గుడ్లు, బాలామృతం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్ రోషిణి, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

## పాల్వంచ శ్రీనివాస్ నగర్ కాలనీ గుట్ట సమీపంలో కొండచిలువ కలకలం





**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / సెప్టెంబర్ 30, (ప్రజా జ్యోతి )** పాల్వంచ పట్టణంలోని స్థానిక శ్రీనివాస్ నగర్ కాలనీ సమీపంలో ఒక్కసారిగా గా సుమారు 12 అడుగుల భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది, కాలనీలోనే గృహ నివాసాల మధ్య ఒక ఇంటి వద్ద అడవిని తలపిస్తున్న చెట్ల పొదల్లో కొండచిలువ జనాల కంట పడింది, దీంతో స్థానికులుఫారెస్ట్ అధికారుల కు సమాచారం అందించారు, స్పందించిన ఫారెస్ట్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని కొండచిలువను కొత్తగూడెం స్నేక్ రెస్క్యూ టీమ్ చాక చక్యంగా పట్టుకొని కొండచిలువను అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు, కొండచిలువను చూసేందుకు భారీగా తరలివచ్చిన స్థానికులు రెస్క్యూ చేయడంతో ఊపిరి పీల్చుకున్న కాలనీవాసులు అనంతరం పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ శ్రీనివాస్ నగర్ కాలనీలో కొన్ని ఇండ్ల పక్కన ఖాళీ స్థలాలు ఉండడంతోపాటు వాటిలో పిచ్చి చెట్లు పెరగడంతో విష సర్పాలు ఏర్పడుతున్నాయని, కావున పాల్వంచ కమిషనర్ తక్షణమే స్పందించి ఇండ్ల పక్కన ఖాళీ స్థలాల వారికి నోటీసులు జారీ చేసి పిచ్చి చెట్లను తొలగించి విష సర్పాల బారి నుండి ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు.

## అంజద్ కు ఘన సన్మానం



**ఇల్లందు, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి )** ఇల్లందు మున్సిపాలిటీలో గత మూడు దశాబ్దాలకు పైగా మున్సిపల్ జవాన్ గా విధులు నిర్వహిస్తూ బుధవారం పదవి విరమణ చేసిన అంజద్ ను 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య పూలమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అంజద్ జీవితం సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పనిలో అంకితభావంతో పని చేసిన వ్యక్తి అంజద్ అని కొనియాడారు.

## క్రీడాకారులను సన్మానించిన ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాచలం, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి ):** జిల్లాకు ఎస్పీ రోహిత్ రాజు పాండిచ్చేరిలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ మీట్ లో పతకాలు సాధించిన భద్రాచలానికి చెందిన క్రీడాకారులను సన్మానించారు.అండర్-18 జావిలిన్ త్రోలో ఎస్.కె. అఫ్రీన్ కాంస్య పతకం సాధించగా, అండర్-14 కిడ్స్ జావిలిన్ త్రోలో బి. పృథ్వికా కాంస్య పతకం సాధించింది. అలాగే హనుమకొండలో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగిన స్టేట్ లెవల్ జూనియర్ నేషనల్ మీట్ లో అండర్-16 జావిలిన్ త్రోలో కే. నవ్య రజత పతకం సాధించింది.ఈ ముగ్గురు క్రీడాకారులను ఎస్పీ రోహిత్ రాజు సన్మానించారు. వీరి కోచ్ జె. గిరిప్రసాద్ ను కూడా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లో కూడా విద్యార్థులు ముందుండాలని, క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని అన్నారు.

## జెన్ జీ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు




**భద్రాచలం, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి ):** ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఉద్యమం స్ఫూర్తిదాయకమని, విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని, పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాలని మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రేపాకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.బుధవారం ఎస్ఎఫ్ఐ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జెన్ జీ అవగాహన సదస్సులో ఆయన, మదర్ థెరిస్సా డిగ్రీ కళాశాల డైరెక్టర్ తోటమల్ల రమణ ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.విద్య, ఉపాధి, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ , విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని వాస్తవ నిర్ధారణ లేకుండా నమ్మకుండా శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో లక్షి , నికిత, పద్మ, అంజలి, రాణి, లక్ష్మీ ప్రసన్న, సాహుల్, ప్రశాంత్, కిషోర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు విధిగా ఫార్మర్ ఐడి, క్రాప్ బుకింగ్ చేయించు కోవాలి

- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల



**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / సెప్టెంబర్ 30 ,(ప్రజా జ్యోతి )** రైతులు విధిగా ఫార్మర్ ఐడి, క్రాప్ బుకింగ్లు విధిగా చేయించుకోవాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పాల్వంచ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కొత్వాల మాట్లాడుతూ రైతులకు డిజిటల్ అగ్రి కల్చర్ మిషన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే గుర్తింపు కార్డుకు విధిగా బుకింగ్ చేయించుకోవాలన్నారు. దీని వలన పి.ఎం. కిసాన్ నిధులు, రైతు భరోసా, పంట నష్టపరిహారం వంటి నగదు బదిలీలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయన్నారు . రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సన్న ధాన్యానికి క్వింటాకు 500 రూ॥లు బోనస్ పొందాలంటే పంట సాగు వివరాలు (క్రాప్ బుకింగ్) నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి 3 శాతం వడ్డీ రాయితీని పొందవచ్చు అని అన్నారు. రైతులు సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల రైతులను కోరారు, ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు కనగాల నారాయణ రావు, సామా జనార్ధన్ రెడ్డి, చౌగాని పాపారావు, భూక్యా కిషన్, యర్రంశెట్టి మధుసూధన్ రావు, సి.ఇ.ఒ. జి. లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు

## విద్యతోనే జీవితాల్లో వెలుగులు




**చర్ల, సెప్టెంబర్ 30 :(ప్రజా జ్యోతి):** విద్యార్థులు ఇతర వ్యాపకాలపై దృష్టి సారించకుండా చదువులపై శ్రద్ధ పెట్టి ఉన్నత స్థితికి చేరుకోవాలని వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత అన్నారు. దుమ్ముగూడెం మండలం డి.కొత్తగూడెం గ్రామానికి చెందిన వనవాసీ ఆచార్యుడు కారం శేఖర్ సోదరుడు కారం రమేష్–రజనీ దంపతుల కుమార్తె కారం శ్లేష్ఠ శ్రేతశ్రీ జన్మదినాన్ని పురస్కరించుకుని కొమరం భీం విద్యార్థి నిలయానికి 50 కిలోల బియ్యం, విద్యార్థులకు పండ్లను అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆశాలత మాట్లాడుతూ నిరుపేద ఆదివాసీ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో వసతిగృహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మారుమూల అటవీ ప్రాంత గ్రామాలకు చెందిన విద్యార్థులను ఇక్కడకు తీసుకువచ్చి నాణ్యమైన విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించడం సంస్థ ప్రధాన ఉద్దేశమన్నారు.విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నారని, తమ ప్రతిభను చదువుల్లో చూపించి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యపై ఏకాగ్రతతో దృష్టి సారిస్తే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చన్నారు. విద్య ద్వారా ఎంతోమంది జీవితాలు మారాయని, వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు.దాతల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు బాగా చదివి వనవాసీ సంస్థతో పాటు తమ తల్లిదండ్రులు, ప్రాంతానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. దేశవ్యాప్తంగా గిరిజన విద్యార్థుల కోసం వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో అనేక విద్యార్థి నిలయాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదని, కేవలం దాతల సహకారంతోనే విద్యార్థి నిలయాలు కొనసాగుతున్నాయని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు సహకరిస్తున్న దాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిలయ కమిటీ ఉపాధ్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, కారం శేఖర్, నిలయ ప్రముఖ్ సంతోష్, సహ ప్రముఖ్ ముఖేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాహ్య మూల్యాంకన ఉత్తర్వులు ఉపసంహరించాలి

- టీపీటీఎఫ్, ఏటీఏ ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్




**భద్రాచలం, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి ):** సమ్మేటివ్ అసెస్మెంట్–1, 2 పరీక్షలకు బాహ్య మూల్యాంకన విధానాన్ని ప్రవేశపెట్టవద్దని టీపీటీఎఫ్, ఏటీఏ ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఏహెచ్ఎస్ ఆర్లగూడెం పాఠశాల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు.టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు, ఏటీఏ జిల్లా ఉపాధ్యక్షులు టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాహ్య మూల్యాంకనం వల్ల ఉపాధ్యాయులపై అదనపు భారం పడటంతో పాటు పాఠశాలల్లో బోధనకు ఆటంకం కలుగుతుందని అన్నారు. బోధించిన ఉపాధ్యాయులే జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తే విద్యార్థుల వెనుకబాటుతనాన్ని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.మండల విద్యా వనరుల కేంద్రాల్లో బాహ్య మూల్యాంకనం నిర్వహించడం ఆచరణాత్మకంగా కష్టసాధ్యమని పేర్కొంటూ, బాహ్య మూల్యాంకన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎస్ఎస్సీ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. నిరసనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాల్వంచ మండలంలో స్వచ్ఛతే సేవ

- 2026 సఫాయి మిత్ర సురక్ష శివార్
- కుటుంబాల భద్రతకు లైఫ్ ఇన్సూరెన్స్ ఎంతో ముఖ్యం
- గ్రామపంచాయతీలు పరిశుభ్రంగా ఉంచడంలో మల్టీ పర్పస్ వర్కర్ల కృషి ఎంతో కీలకం
- డి ఆర్ డి ఎ విద్యా చందన






**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ, సెప్టెంబర్ 30,(ప్రజా జ్యోతి )** స్వచ్ఛతే సేవ–2026 కార్యక్రమంలో భాగంగా పాల్వంచ మండలంలో సఫాయి మిత్ర సురక్ష శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారిని విద్యా చందన, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి. నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి బి. అనూష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వివిధ గ్రామపంచాయతీలకు చెందిన మల్టీపర్పస్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, గతంలో తీసుకున్న లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలను రెన్యువల్ చేశారు. ఇన్సూరెన్స్ తీసుకోని వారికి కొత్త పాలసీలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అడిషనల్ కలెక్టర్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ విద్యా చందన మాట్లాడుతూ గ్రామపంచాయతీలు పరిశుభ్రంగా ఉండటంలో మల్టీపర్పస్ వర్కర్ల కృషి ఎంతో కీలకమని, వారి కుటుంబాల భద్రతకు లైఫ్ ఇన్సూరెన్స్ ఎంతో ముఖ్యమని తెలిపారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి బి. అనూష మాట్లాడుతూ దేశానికి సైనికులు ఎంత అవసరమో గ్రామపంచాయతీలకు మల్టీపర్పస్ వర్కర్లు అంతే అవసరమని అన్నారు. గ్రామాల పరిశుభ్రత [పారిశుద్ధ్య పరిరక్షణలో వారి సేవలు ఎంతో కీలకమని తెలిపారు. మనమంతా ఒకే కుటుంబంగా భావించి పనిచేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి. నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు తప్పనిసరిగా సేఫ్టీ కిట్లు ధరించి విధులు నిర్వహించాలని సూచించారు. డ్రైనేజీ నీరు రోడ్లపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీ సౌకర్యం లేని ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు (సోక్ పిట్స్) తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సర్పంచులకు సూచించారు.ఎంపీడీవో పి. రాజారావు మాట్లాడుతూ మల్టీపర్పస్ వర్కర్ల లైఫ్ ఇన్సూరెన్స్‌కు సంబంధించిన ఖర్చును సంబంధిత గ్రామపంచాయతీలే భరిస్తాయని తెలిపారు. వారి ఆరోగ్యం, భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి పాల్వంచ మండలంలోని అన్ని గ్రామపంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, మల్టీ పర్పస్ వర్కర్లు హాజరయ్యారు.

## ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

- వృద్ధుల శ్రేయస్సుపై పెన్షనర్ల ర్యాలీ




**భద్రాచలం, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి ):** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని భద్రాచలం ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ (సీనియర్ సిటిజన్స్ ) ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ జరిపారు.. పాత ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న టీఏపీఆర్పీఏ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం నుంచి ఉదయం 10.30 గంటలకు అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభమైంది.95, 85, 80 ఏళ్లకు పైబడిన పలువురు పెన్షనర్లు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. ‘వృద్ధాప్యం భారం కాదు.. బాధ్యత’, ‘వృద్ధాప్యం వయసుకే గానీ మనసుకు కాదు’, ‘తల్లిదండ్రులను పంచుకోకండి.. ముదిమి వయసులో దూరం పెట్టకండి’ తదితర నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. వృద్ధుల ఫిర్యాదులు, సమస్యలను పోలీసులు సత్వరమే పరిష్కరించాలని కోరారు.సంఘ కార్యాలయం నుంచి భద్రాచలం జూనియర్ కళాశాల వరకు, అక్కడి నుంచి తిరిగి రామ మెడికల్ స్టోర్ వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీని ప్రజలు ఆసక్తిగా తిలకించి సీనియర్ సిటిజన్లను అభినందించారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎస్. రాజబాబు, గౌరవ సలహాదారు మాదిరెడ్డి రామ్మోహనరావు, నాయకులు బి. శ్యామసుందర్ తదితరులు మాట్లాడారు. వృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సమాజం, కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో పెద్ద ఎత్తున పెన్షనర్లు పాల్గొని తమ ఐక్యతను చాటారు. అనంతరం సీనియర్ సిటిజన్లకు బిస్కెట్లు, తేనీటి విందు ఏర్పాటు చేశారు.

## నిర్వాసితులకు న్యాయం చేయాలి





**ఇల్లందు, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి )** నూతన పూసపల్లి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఉద్యోగాలు ఇవ్వాలని ఏఐటియుసీ గుర్తింపు సంఘం అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ లు అన్నారు. బుధవారం నూతన పూసపల్లి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టును ఎఐటియుసి బృందం పరిశీలించారు. సింగరేణి జెకె ఓసిపి రక్షణ అధికారి ఏజీ శివ ప్రసాద్ ఓసి పనులను పూర్తి స్థాయిలో వివరించారు అనంతరం నూతన ఓసిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సబ్ స్టేషన్ ఏరియా, క్రషర్లు నిర్మాణం, ఓసి ఓబి ప్రారంభించే స్థలం పనుల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ఓసిలో స్థానిక నిరుద్యోగ యువతకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పూసపల్లి నూతన ఓసి ఇల్లందు ఏరియా ప్రజల ఆశాకిరణమని, ఈ ప్రాజెక్టును సకాలంలో ప్రారంభించి ఇల్లందు ఏరియాను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమమే గుర్తింపు సంఘ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొరిమి సుందర్, సిపిఐ మండల కార్యదర్శి బొప్పిశెట్టి సత్యనారాయణ, టిజేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగులోత్ కృష్ణ, ఫిట్ కార్యదర్శులు వి జయ రాజ్, దాట్ల వెంకటేశ్వర్లు, తిలక్ నగర్ ఉప సర్పంచ్ షేక్ ఖాసీం, నాయకులు బాషపాక రవి, ఇబ్రహీం, సైదారెడ్డి, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# యూపీహెచ్‌సీ ఓల్డ్ కొత్తగూడెంలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

- సఫాయి మిత్రలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 30, (ప్రజా జ్యోతి)**
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ బుధవారం ఓల్డ్ కొత్తగూడెంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, రిజిస్టర్లు మరియు ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించారు. సిబ్బందికి డీఎంహెచ్ఓ పలు సూచనలు చేశారు, గర్భిణీల ప్రసవ అంచనా తేదీలకు సంబంధించిన ఈ డి డి క్యాలెండర్‌ను మూడు నెలలకు సంబంధించిన వివరాలతో క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు, గత నెల, ప్రస్తుత నెల, రాబోయే నెలకు సంబంధించిన ఈ డి డి వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించి అందుబాటులో ఉంచాలన్నారు, గర్భిణీలను ప్రసవానికి ముందే గుర్తించి, అవసరమైన ఆరోగ్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాల,నీ ప్రయోగశాలను పరిశీలించి, మలేరియా డెంగ్యూ నిర్ధారణకు అవసరమైన టెస్టింగ్ కిట్లు తగినంతగా అందుబాటులో ఉండేలా స్టాక్‌ను నిరంతరం పర్యవేక్షించాలని ల్యాబ్ టెక్నీషియన్‌కు సూచించారు. అన్ని రికార్డులు, రిజిస్టర్లు , స్టాక్ వివరాలను నమోదు చేసి, ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. సఫాయి మిత్రల భద్రత, ఆరోగ్యం పై అవగాహన అనంతరం సఫాయి మిత్ర – సేఫ్టీ అండ్ డిగ్నిటీ క్యాంప్లో డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్ పాల్గొని సఫాయి మిత్రల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ, ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్యంపై ముఖ్య సూచనలు ప్రతిరోజూ పోషక విలువలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలి. శరీరానికి అవసరమైనంత సురక్షితమైన తాగునీటిని పుష్కలంగా తీసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు, కుక్కలు లేదా ఇతర జంతువులు కరిచినప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య చికిత్స పొందాలనీ, పాము కాటు సంభవించినప్పుడు వెంటనే వైద్యసేవలు పొందాలని, పాము కాటు లేదా జంతు కాటు సందర్భాల్లో మంత్రాలు, మూఢనమ్మకాలు, మతపరమైన వైద్యం లేదా ఇతర శాస్త్రీయ ఆధారం లేని పద్ధతులను నమ్మి సమయం వృథా చేయకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే సమీప ప్రభుత్వ ఆసుపత్రి/ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలని తెలిపారు. సఫాయి మిత్రలు పట్టణాలు, గ్రామాల్లో పరిశుభ్రత పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి భద్రత, ఆరోగ్యం మరియు గౌరవం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. సుకృత గుడిపాడు డికల్ ఆఫీసర్, యూపీహెచ్‌సీ ,డాక్టర్ జాన్సీ రామ్ మెడికల్ ఆఫీసర్ పాత కొత్తగూడెం, డాక్టర్ కృష్ణ కుమారి శేఖరం బంజార, మున్సిపల్ మేయర్ గణేష్ , కమిషనర్ సుజాత, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, సఫాయి మిత్రలు పాల్గొన్నారు.

# ఎర్రగుంట అడవుల్లో అడవి పంది వేట.. ఇద్దరి అరెస్ట్

- వేట సామగ్రి స్వాధీనం
- వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 30, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట గ్రామ సమీప అటవీ ప్రాంతంలో అడవి పంది వేటకు పాల్పడిన ఇద్దరిని చంద్రుగొండ అటవీ రేంజ్ పరిధి అటవీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. పనితి నరేష్, మల్ల శ్రీనివాసరావులను వేట కేసులో పట్టుకున్నట్లు అటవీ అధికారులు తెలిపారు.అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా సంచులతో వెళ్తున్న ఇద్దరిని అటవీ సిబ్బంది తనిఖీ చేశారు. వారి వద్ద రక్తపు మరకలు ఉన్న సంచితో పాటు వేటకు ఉపయోగించిన క్లచ్ వైర్ లభించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం సమీప అటవీ ప్రాంతంలో అడవి పంది మృతదేహాన్ని గుర్తించి, వేటకు ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై వన్యప్రాణి సంరక్షణ చట్టం–1972 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. వన్యప్రాణులను అక్రమంగా వేటాడటం, చంపడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో అక్రమ వేటను అరికట్టేందుకు నిరంతరం నిఘా కొనసాగిస్తామని, వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు సహకరించాలని అటవీ క్షేత్ర అధికారి కోరారు.

# నిరుపేద కుటుంబానికి "సమాచారం గ్రూప్" ఆర్థిక సాయం

- దహన సంస్కరణలకు తక్షణ సాయం కింద 5000/- వేలు అందుచేత
- గ్రూప్ సభ్యులు "భారత్" కి ధన్యవాదాలు తెలిపిన అడ్మిన్ రాజా కిరణ్



**భద్రాచలం, సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి )** భద్రాచలం పట్టణంలోని అంబ సత్రం సమీపంలో నరసింహస్వామి ఆలయం పక్కన ఒక నిరుపేద కుటుంబం బరకాలతో గుడారం వేసుకొని జీవిస్తున్నారు. అందులో ఉంటున్న ఎన్. రాజు అనే వ్యక్తికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మంగళవారం సారపాక రోడ్డు పక్కన రాజు అకస్మాత్తుగా చనిపోయి కనిపించగా, భార్య బిడ్డలు కన్నీరు మున్నీరయ్యారు. నిరుపేద కుటుంబం కావడంతో కనీసం దహన సంస్కరణలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ సంఘటనను స్థానికుడు దుర్గ ద్వారా సమాచారం గ్రూపు అడ్మిన్ రాజా కిరణ్ కి తెలియజేశారు. స్పందించిన అడ్మిన్ రాజా కిరణ్ ఈ విషయాన్ని గ్రూప్ సభ్యులు "భారత్" కి తెలపగా నిరుపేద కుటుంబానికి దహన సంస్కరణలకు తక్షణ సాయం కింద 5000/ – అందజేశారు. ఈ నగదును గ్రూప్ సభ్యులు కోకిరాల రవి తో వెళ్ళి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా అడ్మిన్ రాజాకిరణ్ మాట్లాడు తూ.... పేదలకు, రోగులకు సమాచారం గ్రూప్ చేసే ప్రతి సహాయం లో "భారత్" ముందు ఉండటం నిజంగా అభినందనీయం అన్నారు.అదేవిధంగా మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులు సైతం ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి అండగా ఉంటాం

- సర్పంచ్ పూనెం కృష్ణ



**భద్రాచలం, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి ):** ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని భద్రాచలం గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ తెలిపారు. గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సుమారు 300 మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థుల్లో మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పాఠశాలకు అవసరమైన సదుపాయాల కల్పనకు సహకరిస్తామని సర్పంచ్‌తో పాటు గ్రీన్ భద్రాద్రి ప్రతినిధులు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మూడో వార్డు సభ్యుడు బొంతు రమణ, ప్రధానోపాధ్యాయులు జి. జాన్సన్, ఎకో క్లబ్ సభ్యులు బి. జయబాబు, పి.ఎస్.వి. ప్రసాద్ బాబు, గొల్ల భూపతిరావు, ఏ. ఉమామహేశ్వర నాయుడు, ఆర్టీసీ రామరాజు, సత్యసాయి సేవా సమితి ప్రతినిధి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లైన్ ఇన్ స్పెక్టర్ గా జగన్నాథం పదోన్నతి

- ఆళ్ళపల్లిలో లైన్ మెన్ గా సక్రమ సేవలకు గుర్తింపు

**ఆళ్ళపల్లి, సెప్టెంబర్30(ప్రజా జ్యోతి )** ఆళ్ళపల్లిలో లైన్ మెన్ గా విధులు సక్రమంగా నిర్వహిస్తూ, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించిన జగన్నాథంకు లైన్ ఇన్ స్పెక్టర్ గా పదోన్నతి లభించింది. ఈ మేరకు డీఈ రంగస్వామి చేతుల మీదుగా పదోన్నతి ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం టేకులపల్లి సెక్షన్ లో ఏఈ జగదీష్, సబ్ ఇంజనీర్ నజీర్, ఐఎన్ టీయూసీ–327 జిల్లా, డివిజన్ నాయకుల సమక్షంలో లైన్ ఇన్ స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భం గా ఐఎన్ టీయూసీ–327 నాయకులు జగన్నాథంకు శుభాకాంక్షలు తెలిపారు. విధుల్లో మరింత నిబద్ధతతో పనిచేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం జగన్నాథంను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఐఎన్ టీయూసీ–327 నాయకులు ఈ. రాజేష్, ఎం. జానారత్నం, శివకుమార్, కిరణ్ కుమార్, సెక్షన్ సిబ్బంది, లైన్ మెన్ లు పాల్గొన్నారు.



# ఆదివాసి సంక్షేమ పరిషత్ దమ్మపేట మండల కమిటీ ఎన్నిక



**దమ్మపేట, సెప్టెంబరు. 30, (ప్రజాజ్యోతి ):** ఆదివాసి సంక్షేమ పరిషత్ దమ్మపేట మండల నూతన కమిటీని బుధవారం రాష్ట్ర కోశాధికారి కొర్సా వెంకటేష్ దొర ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొర్సా వీధరాజు, ప్రధాన కార్యదర్శిగా పెనుబల్లి రమేష్, కోశాధికారిగా చాప నాగరాజు, ప్రచార కార్యదర్శిగా గుండి నాగరాజు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా ఊకే రాంబా బు, కల్లూరి రాజేష్, మహిళా కార్యదర్శులుగా తాటి రాధ, కుంజా ప్రేమకుమారి ఎన్నికయ్యారు. వీరితో పాటు 16 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు కొర్సా వీధరాజు మాట్లాడుతూ ఆదివాసుల హక్కులు, చట్టాలు, జీవోల పరిరక్షణ కోసం నిరంతరం ప్రజా ఉద్యమాలు చేపడతా మని తెలిపారు. ఆదివాసుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తూ వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఆదివాసి సంక్షేమ పరిషత్ సీనియర్ నాయకులు కురసం చిన్నరాజు, తాటి చందర్రావు తదితరులు పాల్గొన్నారు.

# కుస్తీ బరిలో సత్తా.. రాష్ట్రస్థాయికి త్రిలోచన



**దమ్మపేట, సెప్టెంబరు 30,(ప్రజా జ్యోతి ):** అంకంపాలెం ఆశ్రమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కుంజా త్రిలోచన రెజ్లింగ్‌లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. భద్రాద్రి కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలబాలికల రెజ్లింగ్ ఎంపిక పోటీల్లో త్రిలోచన అండర్–17 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది.విద్యార్థిని ప్రతిభను పాఠశాల హెచ్‌ఎం శారద, డిప్యూటీ వార్డెన్ నాగమణి, పీఈడీ వెంకన్న అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ త్రిలోచనకు శుభాకాంక్షలు తెలిపారు.